క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న గ్రామస్తులు

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్అండ్ ఆర్ కాలనీలో గ్రామ దేవత శ్రీ కొండ సూరమ్మ ఆలయ ప్రతిష్ఠో త్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భా గంగా తొలిరోజు గ్రామ మహిళలు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అభిషేకా లు, పూజలు, హోమాలు చేశారు.

కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడిగా గెంబలి



శ్రీనివాసరావును అభినందిస్తున్న కళింగ వైశ్య సంఘ సభ్యులు

బొబ్బిలి: పట్టణ కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడిగా గెంబలి శ్రీనివాసరావు రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కళింగ వైశ్య సంఘ కల్యాణ మంటపంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గెంబలి శ్రీనివాసరావుతో పాటు కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు



కంటి ఆపరేషన్లకు ఎంపికైనవారితో పుష్పగిరి ఆస్పత్రి సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం, పాగిరి గ్రామాల్లో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. రెండు గ్రామా ల్లో 130 మందికి ఆప్తాలమిక్ అధికారులు పూజిత, ప్రియ తదితరులు కంటి పరీక్షలు చేసి, 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.వీరికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని శిబిరం సమన్వయకర్త లక్ష్మణరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం



నాగరాజును సత్కరిస్తున్న కారుణ్య ఫౌండేషన్ సభ్యులు

బొబ్బిలి: ప్రజల ఆరోగ్య సంరక్షణలో పారిశుద్ధ్య కార్మికులది కీలక పాత్ర అని స్థానిక కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.సి.రాజు అన్నారు. ఇటీవల స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకున్న పురపాలక సంఘానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు బంగారి నాగరాజును ఆదివారం సత్కరించి, నూతన వస్త్రాల ను బహూకరించారు. కారుణ్య ఫౌండేషన్ సభ్యులు ఏ.చిన్నారావు, జి.సి.హెచ్.జి.శర్మ, సోమేశ్వర రావు, కె.రామకృష్ణ, కృష్ణ మోహన్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ఆలయానికి వెళ్తున్న భక్తులు

చీపురుపల్లి: కూరగాయల పంటలను ఆశిస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న నత్తల సంహారణ జరగాలని ఆకాంక్షిస్తూ చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారిని కూరగాయల రైతులు వేడుకున్నారు. ఈ మేరకు పట్టణంలోని కూరాకులవీధి, విజయాకాలనీలో ఉన్న కూరాకుల రైతులు అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరాకుల సామాజికవర్గానికి చెందిన వారంతా పట్టణ శివారున కూరగాయలు పండిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో నత్తలు విపరీతంగా వచ్చి కూరగాయల పంటను పాడు చేస్తున్నాయి. ఆ నత్తల నుంచి పంటలను కాపాడాలని కోరుతూ అమ్మవారికి పూజలు చేశారు.

ఆటా లేదు.. పాటా లేదు..!

- కళాశాలల్లో కొరవడిన వ్యాయామ విద్య
- ఖాళీగా పీడీ పోస్టులు
- కొన్ని చోట్ల మైదానాలు లేక అవస్థలు.. ఉన్న చోట అధ్వానం
- నిర్వీర్యం దిశగా వ్యాయామ విద్య



వర్షపునీటితో బురదమయమైన రాజాం డిగ్రీ, ఇంటర్ కళాశాలల అనుబంధ మైదానం

రాజాం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, శారీరక ధృడత్వానికి, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని, క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగవకాశాలు ఎక్కువని అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడాకార్యక్రమాల్లో చెబుతుంటారు. కానీ ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో వ్యాయామ విద్యకు ప్రోత్సాహం కొరవడుతోంది. పదోతరగతి తర్వాత విద్యార్థులు వ్యాయామం, క్రీడలపై దృష్టి పెట్టలేని పరిస్థితి నేడు నెలకొంది. వ్యాయామ విద్య కళాశాలల్లో కనిపించడం లేదు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యకు సంబంధించిన బోధకు లూ లేరు. ప్రభుత్వ విద్యను ఎల్కేజీ నుంచి పీజీ వరకూ బలోపేతం చేస్తామని, వ్యాయామ విద్య, వృత్తి విద్యకు ప్రాధాన్యత ఇస్తామని ఎన్నిక ల ముందు టీడీపీ కూటమి హామీలు ఇవ్వడమే తప్ప ఇంతవరకూ ఆచరణలో చూపించలేదు. ఫలితంగా ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో వ్యాయా మ విద్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

ఒక్కరు కూడా లేరు..

రాజాం నియోజకవర్గంలో ఏ ఒక్క కళాశాలలో కూడా వ్యాయామ ఉపాధ్యాయుడు లేరు. రాజాంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఇంతవరకూ ఒక్క పీడీని కూడా నియమించలేదు. వంగరలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు రెసిడెన్సియల్ స్కూల్ ఉంది. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రేగిడిలో డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ గురుకులం ఉండగా, ఇందులో కూడా వ్యాయామ విద్యకు సంబంధించి పీడీ లేరు. సంతకవిటిలో ఒక జూనియర్ కళాశాల ఉండ గా, ఇక్కడ ఇంతవరకు ఈ పోస్టు మంజూరు చేయలేదు. ఇవి కాకుండా రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో కస్తుర్బా గాంధీ బాలిక ల విద్యాలయాలలో(కేజీబీవీ) ఆరేళ్ల క్రితం ఇంటర్ విద్య ప్రారంభించారు. ఈ విద్యాలయాల్లో పీడీలు లేక పదోతరగతి వరకు వ్యాయామ విద్య బోధించే పీఈటీలతో ఇంటర్ విద్యార్థినులకు తూతూ మంత్రంగా వ్యాయామ విద్య కొనసాగిస్తున్నారు.



సంతకవిటి జూనియర్ కళాశాల మైదానం దుస్థితి

పేరుకే మైదానాలు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానాల్లో మౌలిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఇవి పేరుకే మైదానాలు తప్ప ఆటలకు ఉపయోగపడడం లేదు. క్రీడా శ్రీ నిధులు వెచ్చిం చినా ఫలితం కనిపించడం లేదు. రాజాం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ఒక్క మైదానమే ఉంది. వర్షం వస్తే మైదానంలో వరదనీరు నిలిచిపోయి బురదమయమవు తోంది. సంతకవిటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఒకే మైదానం ఉంది. ఇక్కడ పంటపొలాల నీరు మైదానంలోకి చేరడంతో అధ్వానంగా తయారవుతోంది. రేగిడి గురుకుల పాఠశాల మైదానం లోతట్టుగా ఉండడంతో ఇక్కడా వర్షాకాలంలో క్రీడలకు అవకాశం ఉండడం లేదు. వంగరలోనూ ఇదే పరిస్థితి. కేజీబీవీల్లో ఈ పరిస్థితి మరింతదారుణం. ఆయా విద్యాలయాల్లో అసలు మైదానాలే లేకపోవడం కొసమెరుపు.

పీడీలను నియమించాలని కోరాం

జూనియర్ కళాశాలల్లోనూ వ్యాయామ విద్య అవసరం. ఇంటర్ కళాశాలలకు పీడీలు నియమించాలని, కాంట్రాక్ట్ ప్రాతిపదికనైనా సరే ఈ పోస్టులు భర్తీచేయాలని విద్యాశాఖను కోరాం. రాష్ట్రం మొత్తంపై ఈ సమస్య ఉంది. మైదానాలు బాగుచేయాల్సిన అవసరం ఉంది . సమస్యలన్నింటినీ త్వరలో విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతాం.

– ఎస్.తవిటినాయుడు, డీవీఈఓ

వ్యాయామ విద్య మరచిపోయాం



ఇంటర్‌కు వచ్చిన తర్వాత వ్యాయామ విద్య మరచిపోయాం. ఇప్పుడు డిగ్రీలో ఆ విద్యకు సంబంధించి బోధకులు లేరు. మైదానం కూడా బాగోలేదు, వర్షాలు పడితే అడుగుపెట్టలేం. ఏ ఆటలూ రావు. ఏ రకమైన ఆటల పోటీల్లో కూడా పాల్గొనలేని పరిస్థితి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల్లో ఉంది.

– గునుపూరు పద్మ, డిగ్రీ విద్యార్థిని, రాజాం

పీడీలు లేరు



ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబోధన బాగుంటుంది. మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ వ్యాయామ విద్యలేదు. పీడీ లేరు. కళాశాల మైదానం కూడా చాలా చిన్నది. ఆటలు, పాటలు వంటివి పదోతరగతి తర్వాత ఉండడం లేదు.

– దోల ఉమావతి, ఇంటర్ ఫస్ట్ఇయర్ విద్యార్థిని, రాజాం జూనియర్ కళాశాల

ఎమ్మెల్సీ పరామర్శ



సురేష్ యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర పోలినాటి వెలమ కార్పొరే షన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం పరామర్శించారు. సురేష్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఎమ్మెల్సీ విక్రాంత్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయు డు, వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, టంకాల ఉమాపాపి నాయుడు, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, గార రమణ, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, కింజరాపు రమేష్ ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుని పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని స్థానిక గ్రీన్ బెల్ట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి కోరారు. స్థానిక కోటి చెరువు, ఈపీడీసీఎల్ కార్యాలయాల వద్ద ఆదివారం సుమారు 50 మొక్కలను నాటారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు శశిభూషణరావు, మరడాన వెంకట్నాయుడు, ఏ.లక్ష్మణరావు, అప్పలనాయుడు, సింహాచలం, పల్లా సత్యనారాయణ, సత్యారావు, శంబంగి సింహాచలం,తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి: ఉపాధి హామీ వేతనదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవా లని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో ఆదివారం ఉపాధి వేతనదారులకు ఈకేవైసీ చేశారు. ఉపా ధి జాబ్ కార్డులో పేర్లు ఉన్న వారంతా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

హక్కుల కోసం పోరాడదాం



చక్కెర కర్మాగారం వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

రేగిడి: కార్మికుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం పోరాడదామని సంకిలి ఈఐడీ ప్యారీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.సురేష్ పిలుపునిచ్చారు. సంకిలిలోని ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ప్రధాన గేటు వద్ద ఈఐడీ ప్యారీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఆదివా రం నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించ కుండా, వారి అభివృద్ధికోసం కృషిచేయాలని కోరారు. ఈఐ డీ ప్యారీ చక్కెర కర్మాగారంలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, పరిశ్రమలో యాజమాన్యం ఎప్పటికప్పుడు భద్రతా తనిఖీ లు చేయిస్తూ కార్మికులకు రక్షణ కల్పించాలని అన్నారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుల శ్రేయస్సు కోసం యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు శిమ్మ కృష్ణారావు, కార్యదర్శి వి.ఆర్.సి.నాయుడు, మడపాన త్రినాథ్, ఎస్.సురేష్, రాంబాబు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బంతి పూలకు భలే గిరాకీ..!



రామభద్రపురంలో సాగులో ఉన్న బంతి



మార్కెట్‌కు బంతిపూలు తెస్తున్న మహిళా రైతులు

రామభద్రపురం: అయ్యప్ప,శివ, గోవింద స్వాముల మాలధారణలు ప్రారంభం కావడం, పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు జరుగుతుండడంతో బంతి పూలకు గిరాకీ పెరిగింది. రామభద్రపురం అంతర రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో బంతి పూల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి.రామభద్రపురం మండలం కూరగాయలు,పూల సాగులో ఉత్తరాంధ్రా లోనే ప్రథమ స్థానంలో ఉంది. మండలంలోని పలు గ్రామాల రైతులు పంట మార్పిడిలో భాగంగా ఎకరాల కొద్దీ బంతి పూలు సాగు చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు చిన్న చిన్న కమతాలతో పాటు పొలం గట్లపై సాగు చేస్తున్నారు.ఉదయాన్నే కోసిన తాజా పూలను నేరుగా మార్కెట్టుకు తేవడంతో వినియోగదారులు,వ్యాపారులు,భక్తులు పోటా పోటీగా కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు.సుమారు 400 నుంచి 500 వరకు పువ్వులు ఉన్న క్రేటర్ ధర రూ.500 నుంచి రూ.600 పలుకుతోంది.రైతులతో పాటు చిరు వ్యాపారులు ఇక్కడ పండిన బంతి,కనకంబరాలు,గులాబి పూలను కొనుగోలు చేసి విశాఖపట్నం,పార్వతీపురం,విజయనగరం,శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ లాభాలను పొందుతున్నారు.రామభద్రపురం పరిసర గ్రామాల భక్తులే కాకుండా గ్రామంపై నుంచి వెళ్లే శివభక్తులు,భవానీ భక్తులు,సాయి,అయ్యప్ప మాలాధారులు ఇక్కడి పూలను తప్పనిసరిగా కొని తీసుకెళతారు. మండల కేంద్రం మూడు రాష్ట్రాల కూడలి కావడంతో జిల్లాలో ఎక్కడ పూజలు,పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరిగినా రామభద్రపురం వచ్చి పూలను కొనుగోలు చేస్తుంటారు.



రామభద్రపురంలో అంతర రాష్ట్ర మార్కెట్‌లో బంతి పూలు విక్రయిస్తున్న రైతులు

కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీ

- నేడు రాజాం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రాజాం: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఏరులై పారుతోందని, ఊరూరా బెల్ట్ షాపులు వెలశాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాల యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి నేతలు నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకు న్నా రని ఆరోపించారు. ఇందుకు నిరసనగా సోమవారం రాజాంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తున్నామని చెప్పారు. కూటమి నేతలు తయారు చేసిన నకిలీ మద్యాన్ని తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ప్రజా ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్న కూటమి తీరును నిరశించడంతో పాటు నకిలీ మద్యం విక్రయాలపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ప్రొహిబిషన్ శాఖకు ప్రజల తరఫున నిరసన తెలిపి అల్టిమేటం ఇవ్వనున్నామని వెల్లడించారు. రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈకార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఉదయం 10 గంటల కు ఈ ర్యాలీ శ్రీకాకుళం రోడ్డులో ప్రారంభమవుతుందని, ఎక్సైజ్ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ నిరసన తెలపనున్నట్టు స్పష్టం చేశారు.

నకిలీ మద్యంపై నిరసనకు తరలిరండి



మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో టీడీపీ కూటమి నేతల ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విచ్చలవిడి అమ్మకాలపై సోమవారం తలపెట్టిన నిరసన ర్యాలీకి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులంతా బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకో వాలని సూచించారు. అక్కడి నుంచి ర్యాలీగా రైల్వే స్టేషన్ జంక్షన్ మీదుగా ఎక్సైజ్ కార్యాలయానికి తరలి వెళ్లనున్నట్టు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అనంతరం, అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

జీఎస్టీపై బీజేపీకి భజన చేస్తున్న టీడీపీ



మాట్లాడుతున్న శంకరరావు, తదితరులు

బొబ్బిలి: ఎనిమిదేళ్ల పాటు దేశ ప్రజలందరిపైనా రూ.30లక్షల కోట్ల మేర జీఎస్టీ పన్నులు వేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజెప్పాల్సింది పోయి టీడీపీ వారి భజన చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పన్ను విధానం అంటూ రాష్ట్రాల పన్నులన్నీ రద్దు చేసి వాటి హక్కులను కేంద్రం కాలరాసిందన్నారు. జీఎస్టీ పేరిట ప్రజల రక్త మాంసాలు పీల్చి పిప్పి చేశారన్నారు. ప్రాణాంతక వ్యాధులైన హార్ట్ ఎటాక్, క్యాన్సర్ లాంటి జబ్బులకు వాడే మందు లపైనా 24 శాతం పన్ను వేశారన్నారు. అలాగే చిన్న పిల్లలు వినియోగించే పెన్సిళ్ల పైనా 5శాతం పన్ను వేసిన కేంద్రప్రభుత్వం ఇప్పుడు బీహార్‌లో ఎన్నికలు ఉండడంతో జీఎస్టీని రద్దు చేయడం వల్ల ప్రతీ కుటుంబానికి రూ.15వేల వరకు మిగులుతుందని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ద్వారా ప్రచారం చేయించడం మరింత మోసమన్నారు. ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు పన్ను వేసి, ఇంత కాలం మోసం చేశామని దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘ నాయకులు వి.శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

తొందరగా కోతకు వచ్చిన వరి పంట



సంగాంలో కోత దశలో వరిచేను

వంగర: మండలంలోని సంగాంలో వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ ఏడాది గ్రామంలోని రైతులు 150 ఎకరాల్లో ఎంటీయూ–1121 రకం వరిని సాగు చేశారు. సాధారణంగా వరి పంట 120 నుంచి 150 రోజుల్లో కోతకు వస్తుంది. ఎంటీయూ–1121 రకం తేలికపాటి విత్తనాలు కావడంతో వంద రోజుల్లోనే పంట కోతదశకు చేరుకుంది. రైతులు కోతలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దిగుబడులు బాగుండవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నినాదాలకే పరిమితమైన ‘స్వచ్ఛాంధ్ర’

- అపరిశుభ్రంగా ప్రభుత్వ కార్యాలయాలు
- కార్యాలయ ప్రాంగణాల్లో తుప్పలు, పిచ్చిమొక్కలు



తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు



తహసీల్దార్ కార్యాలయంలో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు



పిచ్చి మొక్కల మధ్యలో రామభద్రపురం రైతు సేవాకేంద్రం-3

రామభద్రపురం: మండలంలో ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’ కార్యక్రమం నినాదాలకే పరిమితమవుతోంది. ప్రతీ నెల మూడో శనివారం అధికారులు ర్యాలీలు, అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజల చెవుల్లో ఊదరగొడుతున్నారు. కానీ తమ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత అంశం మాత్రం వారికి పట్టడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పరిసరాలు చెత్తకుప్పలు, పిచ్చి మొక్కలు, తుప్పలతో దర్శనమిస్తున్నాయి. కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు,రైతు సేవా కేంద్రాలు,ప్రజలకు వైద్య సేవ లందించే వెల్‌నెస్ సెంటర్లు,వ్యవసాయ కార్యాలయ పరిసరాలు చెత్తా చెదారాలతో అధ్వాన్నంగా మారాయి. కార్యాలయాల చుట్టూ ఉన్న చెత్తను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న చిల్ల చెట్లు,చెత్తకుప్పల వల్ల కీటకాల తాకిడి ఎక్కువగా ఉందని కార్యాలయాలకు వచ్చే ప్రజలు చెబుతున్నారు.అలాగే సచివాలయాలు, తహసీ ల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదు. కొట్టక్కి వెల్‌నెస్ సెంటర్‌కు రోడ్డు లేకపోగా కేంద్రం ఆవరణమంతా తుప్పలు, డొంకలతో అడవిని తలపిస్తోం ది.రామభద్రపురం రైతుసేవాకేంద్రం-3లో కనీసం మరుగుదొడ్డికి కూడా వెళ్లేందుకు వీలులేని విధంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అలాగే రైతు సేవా కేంద్రం-1 చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రతిజ్ఞలు, ర్యాలీలు చేయడం, మానవహారాలు ఏర్పాటు చేయడం, సభల నిర్వహణతో ఫొటోలకు పోజులిచ్చి ఆ ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడమే కానీ క్షేత్రస్థాయిలో లక్ష్య సాధన వైపు అడుగులు వేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.